


# శాంతి నిలయం

ఎన్నాళ్ళకు 'రాఘవ' దగ్గరనుండి జాబు! 'పర్సనల్ - మెయిల్' ట్రేలో వున్న ఆ కవరు మీది అక్షరాలను చూస్తూ గుర్తించానా దస్తూరిని. రాఘవలోని నెమ్మదితనం.... సంకోచం రూపు దిద్దుకొని ప్రత్యక్ష మౌతాయా అక్షరాలు.

ముప్పయ్ అయిదు సంవత్సరాలనాడు - అమలాపురం హైస్కూలులో తర్డ్ ఫారంలో చేరిన నాడే రావాడ మాస్టారికి అప్పగించారు నన్ను అన్నయ్య- ప్రైవేటు కంటూ .

మాస్టారు ప్రైవేటంటూ ఎవరికీ చెప్పరు - వారి యిల్లొక ఉచిత విద్యాయలం వారి సమక్షంలో వుండటమే ఒక శిక్షణ.

హైస్కూల్లో క్లాసు అయిపోగానే... మాస్టారింటిలో వుండేవాణ్ణి. భోజనానికే మాయింటి కంటూ వెళ్ళటం. రాత్రిళ్ళు చదువు, నిద్ర అంతా మాస్టారింటిలోనే.

నవ్వుతూ మా వదినగారు అనేవారు - 'మా భాస్కరానికి మా యిల్లొక హోటలు - అదీ భోజన హోటలు మాత్రమే-' అని...... అలాగే వుండేది.

మాస్టారిగారు అబ్బాయి 'రాఘవ' నా సహాధ్యాయి. అతడితో పాటే కాఫీలు, ఫలహారాలు. అప్పుడప్పుడు చల్ది అన్నాలు కూడ నాకక్కడ.

రాఘవ అమ్మగారి లాలన అలాంటిది.

అక్కడ మసలేవారందరూ తమ బిడ్డలే ఆమెగారికి. రాఘవా, నేనూ హైస్కూలు నుండి కాలేజి వరకు అలా కలసి మెలసి వున్నాం.

ఆ తరువాతే రాఘవ జీవితంపై ఎన్నో పెను తుపానులు వీచాయి.

కాకినాడలో మేము బి.ఎ. మొదటి సంవత్సరం చదువుతుండగా 'రాడ మాస్టారు ' పోయారు.

ఆయనగారి మరణంతో ఒక మంచి వ్యక్తి జీవితాధ్యాయం అకస్మాత్తుగా ముగింపుకొస్తే - ఆ ముగింపే రాఘవ చదువుకూ కలిగింది.

మాస్టారి మరణంతో పాత అప్పులకుగాను అమలాపురంలోని పూర్వీకుల నుండి వస్తోన్న ఆ యిల్లు.... రాఘవ తల్లిగారి మెడలోని చంద్రహారం, చేతికున్న గాజులు కరగి పోగా మిగిలింది మాస్టారు ప్రతి నిత్యం పారాయణ చేసికొనే వావిళ్ళవారి ప్రతి 'భగవద్గీత' ఒక్కటే!

నాతో వుండి కనీసం బి.ఎ. పూర్తి చేయమన్నాను. ఆ బాధ్యతను తాను తీసికొంటానన్నారు అన్నయ్య రాఘవతో.

కానీ రాఘవ మిగిలిన బాధ్యతల పెను కౌగిలిలో ఇరుక్కు పోయాడు.

చెల్లి పెండ్లి; తల్లిని పోషించుకోవటం. ఆ నాటి నుండి రాఘవ జీవితపు అదుపు ఆజ్ఞకులోబడి ఆటు పోట్లను ఎదుర్కొంటూ ఎటునుండి ఎటో ప్రవాహంలోని 'దారువు'లా కొట్టుకొని పోయాడు.

"కొమ్మూరులో ఐ.యల్.టి.డి. కంపెనీలో గుమస్తానయ్యాను" అంటూ వ్రాశాడో సారి. అప్పటికి నేను యూనివర్సిటీలో వున్నాను.

"చెల్లాయి పెండ్లి! తప్పక వస్తావు కదూ?" అని మరోసారి వ్రాశాడు. తప్పక వెళ్ళి తలపైన వేసికొని నెరవేర్చవలసిన శుభకార్యమది. కాని, 'సర్వీసు కమీషన్' 'గ్రూప్ వన్' పరీక్షలు వ్రాస్తూ వెళ్ళలేక పోయాను.

కనీసం రాఘవ అమ్మగారు పోయారని వ్రాసిననాడూ వెళ్లలేకపోయాను, వాడు వ్రాసిన జాబు చిరునామా మార్పు వలన చాలా ఆలస్యంగా చేరటం మూలంగా.

చనిపోబోయే ముందు - "ఒక్కసారి భాస్కరాన్ని చూడాలని వుంది నాయనా" అన్నారట రాఘవ అమ్మగారు. రాఘవ పెండ్లికి వెళ్ళినప్పుడు చెప్పాడీమాట. 'కృతజ్ఞతా ధర్మం నుండి ఈ బ్రతుకు భారం మనల్ని ఎంత నిర్దాక్షిణ్యంగా వేరు చేస్తుందో-' అనిపించింది.

రాఘవ భార్య- 'జానకి' వాడి మేనమామగారి కూతురే. నాకు చిన్ననాటి నుండి తెలిసినదే. వరసాగ్గా ఆడపిల్లలు రాఘవకు.

నేను విశాఖ కాల్‌టెక్సులో వుండగా - 'ఈ పొగాకు కంపెని ఉద్యోగికి సెక్షన్ గుమస్తా ఉద్యోగం నుండి ప్రమోషన్ లేకపోయినా - చీకటి కోనలో చిరుదీపంలా ముగ్గురు ఆడపిల్లల తరువాత ఒక వంశోద్ధారకుడు - 'కృష్ణ' వెలిశాడు' అని వ్రాసాడు.

మాస్టారి పేరు 'రావాడ కృష్ణమూర్తి'. ఆయనగారి పేరు పెట్టారనుకున్నాను.

రాఘవ....... నేనూ ఉత్తరాలే వ్రాసికోవటానికి కూడ తీరిక లేని బ్రతుకు చిక్కు పరదాలలోకి జారిపోయామా తరువాత.

నేను ఎన్నో ఉద్యోగాలు మారాను. ప్రదేశాలు మారాను. ప్రవాసాంధ్రుణ్ణి అయ్యాను. తిరిగి తిరిగి ఇరవై సంవత్సరాల తర్వాత ఆంధ్రదేశపు ధరిదాపులకు వచ్చాను - "కటక్" - ఒరిస్సా రాష్ట్రంలోని ఎరువుల కర్మాగారానికి 'యం.డి' గా వచ్చి చేరాను.

ఎలా నా చిరునామా పట్టుకోగల్గాడో! ఈనాటికి రాఘవ జాబు! గుంటూరు నుండి?

భాస్కరం!

మీ కంపెనీలో పని చేస్తున్నాడు - మా కృష్ణ వాడు వ్రాశాడు. 'భాస్కరం గారని మా యం.డి. తెలుగువారే'- అంటూ.... వాడు వ్రాసిన వివరాలలోని ఆ కళ్ళజోడు - నెరిసిన జుట్టు - వయసుతో పాటు వచ్చి వుంటాయని సరిపెట్టుకుంటే తతిమా పోలికలన్నీ నీవే. నీవే అయివుంటావని వ్రాస్తున్నాను.

మరి నీవే అయివుంటే జవాబు వ్రాయి వెంటనే. నేనూ, జానకి క్షేమం.

ఒక జీవితకాలం ఆశ్రయమిచ్చిన ఈ ఉద్యోగం నుండి నేడో రేపో విశ్రాంతి లభిస్తుంది. మా కంపెనీవారు తమ చాలా బ్రాంచిలను మూసివేస్తూ నాలాంటి వారికి ఏదో ముట్టజెప్పి విశ్రాంతి ఏర్పాటు చేస్తున్నారు-

జవాబు కోసం ఎదురు చూస్తూ వుంటాను - రాఘవ.

జాబు చదవటం పూర్తి చేసిన నాకు - క్రిందటి జన్మలోని ఏ ఆత్మీయుడో - చిన్ననాట తప్పి పోయిన ఏ సోదరుడో ప్రత్యక్షమైనట్లు అనిపించింది.

మనసు ఉద్వేగంతో వూగిపోయిందో క్షణం.

ఇంటర్‌కంలో పర్సనల్ ఆఫీసరు 'జైన్' ను పిలిచి 'ఆర్.కృష్ణ.... అంటే ఆర్. కృష్ణమూర్తి లేక కృష్ణారావు ఏదో అయి వుంటుంది పేరు. తెలుగువాడు.... ఏ

బ్రాంచిలో వున్నాడో కనుక్కొని - నా దగ్గరకు పంపించండి-" అన్నాను.

ఓ గంట తర్వాత పర్సనల్ ఆఫీసరు - "సర్.... ఆర్... కృష్ణ గోపాల్ అయి వుండాలి. మన కంపెనీలో ఇద్దరే తెలుగువాళ్ళున్నారు. రెండవ అతని పేరు వి. నరసింహం." అన్నాడు.

"మిస్టర్ జైన్! కరెక్టు యువర్ సెల్ఫ్. అంటే ముగ్గురు తెలుగువారున్నా రన్నమాట. మూడవ వ్యక్తి బి. భాస్కరం" అన్నాను.

జైన్ క్షణకాలం అవాక్కయి..... "ఓ సారీ! క్షమించండి సర్..... ఆ కృష్ణ గోపాల్‌కు ఈ రోజు 'ఆఫ్' - ఫ్యాక్టరీకి రాలేదు."

"రెసిడెన్స్-?" ప్రశ్నించాను.

"ఒక్క క్షణం సర్......... మన కంపెనీ క్వార్టర్సే.... క్వార్టరు నంబరు 'సి-142' సౌత్ కాలని-"

కృష్ణ క్వార్టర్సుకు కారు పంపి, సాయంత్రం బంగళాలో అతని రాకకై ఎదురు చూస్తూ ఉండిపోయాను.

"వారి క్వార్టరు తాళం వేసివుంది సార్..... ప్రొద్దుపోయే వరకు వచ్చేలా లేరు. సిటీలోకి వెళ్ళినట్లుంది. చీటి వ్రాసి పక్క క్వార్టర్స్‌లో యిచ్చి వచ్చాను-". చెప్పాడు డ్రైవరు.

ఆనాటికి కృష్ణ దొరకడనిపించి.... టేబిలుపైనున్న ఫైల్స్ చూడటంలో మునిగిపోయాను. రాత్రి 9 గంటలయి వుంటుంది. వాచ్‌మన్ ఓ చీటి నా ముందుంచాడు. "ఆర్. కృష్ణ గోపాల్."

"రమ్మను" అంటూ లేచి రూము తలుపు దగ్గరకు ఎదురు వెళ్ళాను.

ఎర్రగా..... బక్క పలచగా.... కోటేరేసిన ముక్కు. చక్కని క్రాఫ్ ....... ప్రతి కదలికలోనూ ఏదో మర్యాద - సంస్కారం.

గది గుమ్మం దగ్గరి కొచ్చి, "నమస్కారం!" అన్నాడు. 35 సంవత్సరాల నాటి బాల్యంలోని రాఘవలోని బెరుకుతనం బదులు కృష్ణలో ఏదో 'స్పార్క్!'

రాఘవ ఆడపిల్లలను చూచాను. కృష్ణను చూడటం మొదటి సారి. గదిలోకి వచ్చిన కృష్ణను సోఫాలో కూర్చొండ బెట్టి అడిగాను -

"మీ యం.డి.గ్గా, కాక - నేనెవరో తెలియదు కదూ?"

ప్రశ్నార్థకంగా చూస్తూ వుండిపోయాడు. "మీనాన్న ఏనాడూ చెప్పలేదా....

తన స్నేహితుడు.... ఓ భాస్కరాన్ని గురించి-?

ఒక్కసారిగి ఉద్విగ్నుడై - "మీరు....... మీరు నాన్నగారి భాస్కరం గారా-!?" నిలువెల్లా ఆశ్చర్యపోయాడు.

కృష్ణ ప్రక్కనే కూర్చున్నాను.

ఏదో ఇబ్బందిగా ఫీలవుతున్న కృష్ణతో, "ఈ నాలుగు గోడల మధ్య నీవు ఫ్యాక్టరీ కెమిస్టువూ కావు - నేను మీ యం.డి. నీ కాదు. నీవు మా రాఘవ కృష్ణవు - నేను నీభాస్కరం బాబాయిని - అంతే!" అన్నాను.

కృష్ణతో అలా అర్ధరాత్రి వరకు ఏవేవో మాట్లాడుతూనే వున్నాను. ఎన్నో వివరాలకై ప్రశ్నించాను. మరెన్నో గత స్మృతులను నెమరువేసి కొన్నాను. నేనూ,, రాఘవా ఎలా చెరో ప్రక్కకు చెదిరిపోయామో సింహావలోకనం చేసికొన్నాను.

"అవును! నాన్నగారు ఎప్పుడూ మీ సహాయాలే మాట్లాడే వారు-" అన్నాడు కృష్ణ

రాఘవ జీవనయాత్రలో ఎన్నో ప్రాంతాలు తిరిగాట్ట. ఎలాగోలాగ ఆడపిల్లల పెండ్లి చేశాడట. కృష్ణను మాత్రం. బి.యస్.సి. తరువాత చదివించలేకపోవటంతో - కృష్ణ ఈ ఉద్యోగం సంపాదించుకొని సంవత్సరంగా ఇక్కడే వుంటున్నాడట.

భోజనం కంపెనీ కాంటీన్‌లో.

"మీరు - మీరని తెలిసి కాదు..... ఏదో నాన్నగారికి జాబు వ్రాస్తూ - తెలుగువారు కదా అని మిమ్మల్ని గురించి వివరాలు వ్రాశాను - అంతే" అన్నాడు కృష్ణ

అయ్యరు మేమున్న గదిలోకి తొంగి చూచేవరకు ఆనాటికి డిన్నరు టైము దాటిపోయి చాలసేపయిందని - నా మాటెలా వున్నా కృష్ణ విషయం మాటలలోబడి మరచానే అన్పించింది.

"వస్తూ కాంటీన్‌లో భోజనం చేసి వచ్చాను నేను; - మీకే ఆలస్యమయి నట్లుంది -" నొచ్చుకున్నాడు కృష్ణ.

సమావేశాలతో, సంభాషణలతో గడచిపోయే నా ఉద్యోగ ధర్మంలో నాకిలాంటివి అలవాటే! - పైగా మా "రాఘవ - కృష్ణ"ను చూచాక ఆకలేది? పాలు. పండ్లు తెప్పించుకొని అక్కడికి డిన్నరు పూర్తి అయిందనిపించాను.

"చూడు కృష్ణా! రాఘవను నేడో రేపో రిటైరు చేస్తారట. వాడూ అలసి పోయి

నట్లున్నాడు. వాడింకేమీ చేయనవసరం లేదు. వచ్చేయమందాము. ఇక్కడే మన దగ్గరే వుంటాడు. ఎన్నాళ్ళుగానో మేమిద్దరం ఒకరినొకరు "మిస్" అయ్యాము. అదంతా వడ్డీతో సహా పూరించుకొంటూ గడిపివేయవచ్చు ఏమంటావు?" అన్నాను.

"అలాగే!" అంటాడనుకొన్నాను. కృష్ణ నుండి ఎలాంటి సమాధానమూ రాలేదు. మౌనంగా వుండిపోయాడు. ఆమోదకంగా - ఓ చిరునవ్వైనా నవ్వలేదు. కించిత్తు ఆశ్చర్య మేసింది నాకు.

"వస్తాను సార్ - సెలవిప్పించండి-" అన్నాడు లేచి నమస్కరిస్తూ.

"చెప్పానుగా కృష్ణా! ఈ బంగళా పరిధిలో నేను నీకు 'సర్'ను కాదు - బాబాయి భాస్కరాన్ని" చెప్పాను మరోసారి.

అక్కడికి కృష్ణ వుండే క్వార్టర్సు చాల దూరం. సిటీ బస్సులు ఆగిపోయిన టైమది. నా డ్రైవరూ వెళ్ళిపోయాడింటికి.

నేనే గారేజి నుంచి కారు బయటకు తీశాను కృష్ణను క్వార్టరు దగ్గర డ్రాప్ చేయటానికి.

"మీ కెందుకు శ్రమ - నడచి వెళతాను" - అన్నాడు.

"భలేవాడివే - ఇంతటి రాత్రి రెండు కిలోమీటర్లు నడిచి వెళతావా? రేపు 'రాఘవ'కు తెలిస్తే నన్నేమంటాడు-" అంటూ కారు స్టార్టు చేశాను.

"అంతేకాదు - రేపు 'రాఘవ'వచ్చాక ఎన్నిమార్లు మీ క్వార్టరుకు రావాల్సి వస్తుందో - వాడితో కబుర్లు చెప్పుకునేందుకు. మరి దారి తెలియాలిగా - అందుకు" - అన్నాను.

మరి తప్పదన్నట్లు కారెక్కి కూర్చొన్నాడు. రెండు కిలోమీటర్ల కంటే ఎక్కువే దూరం కృష్ణ క్వార్టరుకు. అప్పటికీ దగ్గర దారి 'కిర్లోస్కర్ సర్కిల్' మీదుగా వెళ్ళాము. కృష్ణే ఆ దగ్గర దారి చూపాడు. ఆ దారిలోనే బిజినెస్ మాగ్నేట్ సిరాజుద్దీన్ బంగళా. దాని ముందుగానే వెళ్ళాము.

ఆ ప్రాంతానికల్లా 'సిరాజుద్దీన్' ఎంతటి గొప్పవాడో అంతటి గొప్పతనంతో నియాన్ లైట్లతో వెలిగి పోతోంది ఆ బంగళా అంతటి రాత్రిలోనూ.

కృష్ణను క్వార్టరు దగ్గర వదిలి - తరుచుగా - వీలయినంత తరుచుగా

కలుస్తూ వుండమని మరీ మరీ చెప్పి తిరిగి వచ్చాను.

★ ★ ★

మరునాడు పనిలో మునిగి పోయిన నాకు 'రాఘవ'కు తిరుగు జాబు వ్రాయాలని మధ్యాహ్నం లంచ్ వేళకు గాని గుర్తుకు రాలేదు.

అరే రాఘవా!

అవును, నీ భాస్కరాన్నే! మనం దూరమైనా నా పోలికల వర్ణనతో నన్ను నీవు గుర్తించటం. ఏనాటివో అయినా నీ అక్షరాలను నేను గుర్తించటం..... మనం నిజంగా దూరం కానట్లు కదూ!

వాళ్ళెవరో రిటైరు చేసేవరకూ ఎందుకు? నీవే రిజైన్ చేసి వచ్చేసెయ్. నీకేమిరా, సంపాదించి తెచ్చిపెట్టే కొడుకున్నాడు. వచ్చేసెయ్!

ఇన్నాళ్ళూ మనల్ని దూరంగా వుంచి తమాషా ఆడించిన విధిని - ఇక మనం తమాషాచేద్దాం!

- నీ, భాస్కరం

"రాఘవ" చిరునామా కోసం వెదికాను. రాఘవ జాబులో లేదది.

స్టెనోతో - "ఫ్యాక్టరీ లేబరెటరీకి ఫోను చేసి కృష్ణగోపాల్‌ను ఫోనులోకి రమ్మని చెప్పు-" అన్నాను.

ఫోనులోకి ఫాక్టరీ ఛీఫ్ కెమిస్టు వచ్చాడు.

"సర్..... కృష్ణ గోపాల్ నుండి వారం రోజులకు సి.యల్ . వచ్చిందీ రోజు-"

"వ్హాట్?" అన్నాను ఆశ్చర్యంగా.

"అవును సర్"

"రీజన్ ఫర్ ది సి. యల్?"

"ప్రైవేట్ ఎఫైర్స్."

ఈసారి నిజంగా ఆశ్చర్యపోయాను. అతగాడు వారం దినాలు సెలవు పెట్టి సెటిల్ చేయలసినంతటి ప్రైవేట్ ఎఫైర్స్ ఏముంటాయా అని. ఏమయితేనేం రాఘవకు వ్రాసిన జాబు పోస్టు కాకుండానే వుండిపోయింది.

ఆ రోజు చాలసార్లు కృష్ణ - అతని ప్రవర్తన. గుర్తు కొచ్చాయి. అప్పుడు స్ఫురించింది. రాత్రి నేనెంతో వుత్సాహంగా మాట్లాడుతూ ప్రశ్నిస్తూ నిలువెల్లా పొంగిపోతూ వుంటే కృష్ణ ఏదో పరాకుగా ప్రతిస్పందన అంతగా లేక వుండిపోయాడు.

రాఘవను రమ్మనమందాము అని నేనన్నప్పుడు - మౌనంగా ఎలాంటి రియాక్షను లేని కృష్ణ జ్ఞాపకం వచ్చాడు.

అవును! అతడేదో పరధ్యానంగానే వున్నట్లుంది.

కృష్ణ గుంటూరు వెళ్ళాడేమో...... అలా అయితే నాకు చెప్పకుండా వెళతాడా....... ఎందుకో కృష్ణ గుంటూరు వెళ్ళి వుండడనిపించింది. వారం రోజుల సి.యల్. గడవక ముందే, సెలవు రద్దు చేసుకొని రావచ్చు అని కూడా అనిపించింది.

★ ★ ★

నాలుగు రోజులు గడిచాయి.

అర్జెంటు పనిమీద ఫ్లైట్‌లో ఢిల్లీ వెళ్ళి తిరిగి వచ్చాను. ఈ నాలుగు రోజులలో ఎక్కడున్నా కృష్ణను గురించిన ఆలోచనలు నాలో మధ్య మధ్య తొంగి చూస్తూనే వున్నాయి.

ఢిల్లీ నుండి రాగానే వాకబు చేశాను. కృష్ణ జాయిన్ అయ్యాడేమోనని - లేదన్నారు.

రాఘవ నుండి మరో జాబు రానే వచ్చింది.

కృష్ణ వ్రాసాడు. నిన్ను కలిసిన సంగతి - ఏనాడో తప్పి పోయిన పెన్నిధి దొరికినట్లు నా కనిపిస్తే 'కృష్ణకు కొండంత అండ దొరికారు' అంటూ జానకి సంబర పడిపోయింది. ఈ నెలాఖరుకు అనుకొన్న ప్రయాణాన్ని వారం దినాలలోనికి మార్చుకొన్నాము. మిమ్మల్ని చూడాలని మనసెంత వేగిర పడుతుందో

అవును - జాబు వ్రాయలేదేం?

- రాఘవ

అంటే కృష్ణ గుంటూరు వెళ్ళలేదన్నమాట. మరి అతడేమయినట్లు?

★ ★ ★

రాత్రి ఏడు గంటల వరకు ఆఫీసులో వుండిపోయాను, ఆ మరునాటి బోర్డు ఆఫ్ డైరెక్టర్ల మీటింగుకు సంబంధించిన పేపర్లు చూచుకుంటూ.

జైన్..... ఇంటర్‌కంలో "సర్ సిరాజుద్దీన్ గారు వచ్చారు మాట్లాడాలట -" అన్నాడు.

"రమ్మను" అన్నాను.

సిరాజుద్దీన్ అంటే దక్షిణ ఒరిస్సాకు మకుటం లేని మహారాజు లాంటివాడు.

కోటీశ్వరుడు. సహజంగా ప్రతి కోటీశ్వరుని పేరు వెనకాల వుండే కథలన్నీ సిరాజుద్దీన్ వెనకాల వున్నాయి. ఒకప్పటి నరరూప రాక్షసుడంటారు. మాఫియా గాంగుల మధ్య తిరిగి, దాదాగా ఎదిగిన తరువాత ఆ చీకటి జీవితం వదలి..... వ్యాపారవేత్తగా స్థిరపడ్డాడంటారు. నాకు పరిచయం అయ్యాక అతనిని గమనించాను. నాతో మంచిగా - ఒక విధంగా స్నేహపాత్రంగా వ్యవహరించాడు. అతని గత చరిత్రతో నాకేం పని. అయినా 'మనుషులు మారరు' అనే సిద్ధాంతం పట్ల నమ్మకం లేని వ్యక్తిని నేను.

కొద్ది నిమిషాల తరువాత నా గదిలోకి వచ్చాడు సిరాజుద్దీన్.

"కమాన్ సిరాజుద్దీన్ సాబ్" అంటూ కుర్చీ చూపించాను.

ఎప్పుడూ నవ్వుతూ వుండే సిరాజుద్దీన్ మోము రాజుకొంటున్న నిప్పులా వుంది.

ఎదురుగా కూర్చొన్న సిరాజుద్దీన్‌తో "యస్?" అన్నాను చిరునవ్వుతో.

మౌనంగా వుండిపోయాడు; కాని లోలోన కుతకుతలాడుతున్న వైఖరి కనిపిస్తోంది.

అతని 'సదరన్ ఏజన్సీస్ కెమికల్ ఎంటర్ ప్రైజస్' కంపెనీ మాకు 'రా' మెటీరియల్ సప్లై చేస్తుంది. నాకు తెలిసినంతవరకు మా ఫాక్టరీకి - అతనికి లావాదేవీలలో ఎలాంటి పేచీలు లేవు.

తాను కూర్చున్న కుషన్డు సోఫాలో అసహనంగా కదిలి సిగరెట్టు వెలిగించుకొన్నాడు.

"చెప్పండి" అన్నాను.

"భాస్కరం సాబ్.... చాల పర్సనల్" అంటూ డోరు కేసి చూస్తూ వుండిపోయాడు.

"ఈ గదిలోకి నా పర్మిషన్ లేనిది ఎవరూ రారు" అన్నాను.

సిగరెట్ యాష్ట్రేలో పడవేస్తూనే మరో సిగరెట్టు వెలిగించుకొంటూ, "మీ ఫ్యాక్టరీ ఉద్యోగి - మీ తెలుగువాడేనట; బహుశా మీకు తెలియక పోవచ్చు - కృష్ణ గోపాల్-"

అతని నోట కృష్ణ గోపాల్ అని వినగానే నా అంతరంగంలో ఎక్కడో ఏదో ఛెళ్ళుమన్న ధ్వని.

"ఏమయింది?" అప్రయత్నంగా ప్రశ్నించాను.

"వాడు..... వాడు....!" కోపంతో ఊగిపోయాడు సిరాజుద్దీన్.

నా కుర్చీలో నుండి అప్రయత్నంగా లేచి, సిరాజుద్దీన్ కూర్చొన్న సోఫా ప్రక్కన కూర్చొంటూ "ఏమయింది?" - మళ్ళీ ప్రశ్నించాను.

"వాడు.... కనీసం కన్నెత్తైన నన్ను, నా పరివారాన్ని చూడటానికి అర్హత లేని.... ఆ కుక్క నా అంతఃపురం జనానాలోకి తొంగి చూస్తాడా..... అమాయకురాలైన నా కూతురు నూర్జహానును మాయమాటలతో తీసుకొని వెళతాడా.... సువ్వర్.."

అవమానాగ్నితో అగ్నిగోళంలా కనిపించాడు సిరాజుద్దీన్.

"ఇది మియర్ కిడ్నాపింగ్ భాస్కరం సాబ్".

కృష్ణ - నూర్జహానును తీసికొని వెళ్ళాడా? నమ్మబుద్ధి వేయలేదు. నన్నాక్షణాన ఆవరించినది భయమో.... చలిలాంటి ఆశ్చర్యమో..... కృష్ణ పట్ల ఆందోళనో... అర్థం కాలేదు.

సిరాజుద్దీన్ ఏవేవో సంఘటనలను ఏకరువు పెట్టాడు. అతను మాట్లాడు తున్నదేమిటో అర్థం కావటం లేదు నాకు.

"భాస్కరం సాబ్! మూడు దినాలుగా ఈ నిప్పును గుండెలలో దాచి పెట్టుకొన్నాను. మీ వరకు రావలసిన విషయం కాదిది. మీ కంపెనీ ఉద్యోగి - అదీ మీ తెలుగువాడు కాబట్టి మీకు, నాకు వున్న స్నేహం కొద్ది ఎందుకో చెప్పాలనిపించి చెప్పాను. అంతే! మిమ్మల్ని కల్పించుకోమని కాదు - ఇక వాడు మీ ఉద్యోగంలోనే కాదు - ఈ పృథ్వీపైనే లేనట్లు."

సిరాజుద్దీన్ మొహంలో 'నరరూప రాక్షసుడు' అన్న అతని రూపం కన్పించింది.

ఎప్పుడు లేచి వెళ్ళాడో... అతనిలో ఘూరిల్లుతున్న కోపాగ్నిని సృష్టించిన వాతావరణం నుండి తేరుకొనే సరికి టేబిల్‌పై బజర్ మ్రోగుతోంది.

పర్సనల్ ఆఫీసరు జైన్ సర్ అంటూ ఏదో ఇంటర్‌కంలో చెప్పబోయాడు.

"మరో గంట నన్ను డిస్టర్బ్ చేయకండి" అన్నాను చికాగ్గా. మనసంతా వికలమయింది.

చిన్న చిన్నగా సిరాజుద్దీన్ ఏం మాట్లాడిందీ మననం చేసికోవటం ప్రారంభించాను.

నూర్జహాన్ను నాకు తెలుసు. అంటే ఓసారి ఆ అమ్మాయి బర్త్‌డే పార్టీకి

వెళ్ళాను. చిదిమిన దీపంలా ఉంటుంది. మంచుబిందువుల మధ్య విరిసిన గులాబిలా వుంటుంది. యూనివర్సిటీలో ఎం.ఎ. లిటరేచర్, ఫైనలియర్ చేస్తున్నదని చెప్పినట్లు గుర్తు.

ఐశ్వర్యపు ఆకాశ హర్మ్యంలో వున్న నూర్జహానుకు ధూళి దూసరమైన వీధిలో వున్న కృష్ణకు... ఎలా.... ఎలా సంభవించిందిది.....?

సంస్కారభరితుడైన కృష్ణ నా, సిరాజుద్దీన్ అన్ని మాటలన్నది!

కృష్ణ ఎంతటి ప్రమాదంలో వున్నాడో స్ఫురించేపాటికి భయం వేసింది. ఏం చేయటం? ఆలోచనలతోటే బంగళాకు వెళ్ళాను.

మరునాటి బోర్డాఫ్ డైరెక్టర్సు మీటింగుకు సంబంధించిన ఫైళ్ళను, స్టాటిస్టికల్ రిపోర్టులను యాంత్రికంగా చూస్తూ వుండిపోయాను చాలా ప్రొద్దుపోయేవరకు.

నిదుర పోదామని కనులు మూసికొంటే -"ఏ చీకటి కోనలోనో భయకంపితుడై ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పరుగిడుతున్న కృష్ణను - సిరాజుద్దీన్ తాలూకు ముష్కరుల గుంపు వెన్నాడుతున్న దృశ్యాలు కన్పిస్తున్నాయి.

కలత చెందిన మనస్సును కూడగట్టుకొని బలవంతంగా విశ్రమించాను. ఎప్పుడు నిద్రపట్టిందో గుర్కా నొక్కిన కాలింగ్ బెల్లుకు గబుక్కున లేచాను.

తెల్లవారు ఝామున మూడు గంటలయింది.

గది తలుపులు తెరిచాను.

శాల్యూట్ చేసి, "ఎవరో వచ్చారు సాబ్ తమరిని నిద్రలేపమని ఒకటే గొడవ.'' భయం భయంగా చెప్పాడు.

అతనలా చెపుతుండగానే గది వెలుపలి చీకటి నుండి, "క్షమించండి.... ఈవేళప్పుడు నిద్రాభంగం కలిగించాను''- అంటూ గదిలోకి కృష్ణ వచ్చాడు.

నా నిద్రా మైకం చెల్లా చెదురయి పోయింది.

'గూర్కా'ను పంపివేసి - గది తలుపులు మూసి - కృష్ణను నా బెడ్‌పైన కూర్చుండ పెట్టుకొని - "ఏమయింది కృష్ణా'' అన్నాను ఎంతో ఆర్తితో.

కృష్ణ చెప్పటం ప్రారంభించాడు.

★ ★ ★

సంవత్సరం క్రితం ఈ ఎరువుల ఫాక్టరీలో తాను పాసయిన బి.యస్.సి. ఫస్ట్ క్లాస్ ఆధారంగా 'కెమిస్టు' వుద్యోగి అయ్యాడు కృష్ణ. ఇంకా ఉద్యోగ బాధ్యతలతో

వుండిపోయిన - 'రాఘవ, జానకి' అతని వెంట రాలేక పోయారు.

కృష్ణకు విద్యార్థిగా కూడా స్నేహితులు, సినిమాలు, షికార్లు అలవాటు తక్కువ. మంచి పుస్తకాలు, లైబ్రరీలు, సాహిత్య సభలు.... ఇవే మంచి స్నేహితులు.

కటక్ వస్తూనే రీజినల్ సెంట్రల్ లైబ్రరీలో మెంబరయ్యాడు. సెలవు దినాలలోనే కాదు ఫాక్టరీ షిఫ్ట్ అయిపోయాక తీరిక సమయాలలో కూడా ఆ లైబ్రరీలోని తెలుగు, ఇంగ్లీషు, అనువాద సాహిత్యపు గ్రంధాలున్న గదులకు అంకితమై పోయేవాడు.

అదిగో.... అక్కడే....

ఎం.ఎ.లో రెండవ లాంగ్వేజీగా 'తెలుగు' తీసికొన్న నూర్జహానును... ఆ భాషను మొక్కుబడిగా కాక, మక్కువతో వెంటాడుతూ కృష్ణకు పరిచయ మయింది.

తెలుగు భాషా సాహిత్యంతో కృష్ణ కున్న సాన్నిహిత్యం ఆ భాషపట్ల నూర్జహానుకున్న అభిలాష వాళ్ళిదర్నీ చేరువ చేస్తే - 'కృష్ణ' కున్న సాహిత్య భావుకత - సాహిత్యం పట్ల అతనికున్న అవగాహన నూర్జహానును మంత్ర ముగ్ధురాలిని చేశాయి.

ఆ సెంట్రల్ లైబ్రరీ లాన్సులో కూర్చొని ఏ కృష్ణ శాస్త్రి గారి ఊర్వశి గురించో - జాషువా గారి 'ఫిరదౌసి' గురించో వాళ్ళలా చర్చించుకొంటూ వుంటే, ఎన్ని సాయం సంధ్యలు వాళ్ళ మధ్య కరిగిపోయాయో! కృష్ణ గోపాల్ నిశిత సాహిత్యాభినివేశం నూర్జహానుకో మధుర స్మృతి.

కృష్ణ ప్రవర్తనలోని నిజాయితీ, అతని భావనలోని అభిజాతత్వం .... ఆ మాటలలోని నిండుతనం చూచిన 'నూర్జహాను' సమ్మోహితురాలయింది. కృష్ణవ్యక్తిత్వం ముందు తనకున్న వనుకుంటున్న సిరిసంపదలు, చాల పేలవంగా కన్పిం చాయి.

ఈ సంవత్సర కాలంలో తాను గుర్తించకుండానే కృష్ణకు ఎంత దగ్గరయిందో, తన తల్లిగారు తన వివాహం గురించి ప్రస్తావించినపుడు కాని గుర్తించలేదు నూర్జహాను.

ఏదో పెద్ద కుటుంబం నుండి వచ్చిన సంబంధం - కోటికి పడగలెత్తినవారు. వారికి అరబ్ దేశాలలో కూడా ఆస్తులున్నాయట.

అమ్మ వర్ణించిన ఆ నవాబుగారి మూర్తి నిలువలేదు నూర్జహాను మదిలో - ఎందుకో కృష్ణగోపాల్ కనిపించాడు మనసు నిండా.

మరునాటి సాయంత్రం కృష్ణను, 'ఎందుకు', 'ఎక్కడకు' అని ప్రశ్నించటానికి అవకాశం యివ్వకుండా తన కారులో ఎక్కించుకొని సిటీకి దూరంగా వున్న తమ ద్రాక్షతోట దగ్గరకు తీసికొని వెళ్ళి -

"నేనే నీ దాన్ని.... మరెవ్వరి దానను కాలేను" అని తన్ను తాను నివేదించు కొంది.

నిరుత్తరుడై ఆశ్చర్యపోయాడు కృష్ణ.

"ఇది ఆవేశంలో వయసు కోరిన చిలిపి కోరిక కాదు. ఏదో జన్మజన్మల బంధంలా అనిపిస్తోంది-" అంది నూర్జహాను.

కృష్ణ ఆమె కనులలోకి చూస్తూ వుండిపోయాడు. ఆ కనులలో తిరుగులేని నిర్ణయం, నివేదన కన్పించాయి. తన్ను తాను ప్రశ్నించుకొన్నాడు.

డైమండ్ నెక్లస్‌తో, వజ్రాల హారాలతో 'డాట్సన్' పారిన్ కారులో తిరుగాడే శ్రీమంతురాలు నూర్జహాను కన్పించలేదు తనకు..... ఏ 'రాయప్రోలు', 'బాల గంగాధర తిలక్' కవితారాధనా తన్మయురాలైన నూర్జహాను రూపమే నిలచింది తన ముందు. ఆ భావం తనను పులకరింప చేసింది. వెలికి వస్తోన్న ఎన్నో ప్రశ్నలను, సందేహ సంశయాలను తనలోని నిలువరించుకొని, -

"పెద్దల ఆమోదామోదాలు"? ప్రశ్నిచాడు కృష్ణ

"అవి నాకు లభించవు -" అంది బేలగా.

"ఆలోచిద్దాం.... ఆగు - " అన్నాడు కృష్ణ.

కొంత కాలం అంతస్థులు.... ఆచారాలు, వాటిని అధిగమించటం; అందుకు తెగువ చూపించటం వంటి వాటి చూట్టూ తిరిగాయి వారి ఆలోచనలు. ఆ ఆలోచనల మధనంలో వారి అనుబంధం మరీ పెనవేసుకొందే కాని పలచబడలేదు.

'కృష్ణ'ను క్వార్టరు దగ్గర దించి నేను తిరిగి వచ్చిన నాటిరాత్రి -

'నూర్జహాను' ఎలా వచ్చిందో... అంతటి నిశిరాత్రి... అదీ నడచి.... కృష్ణ క్వార్టర్సుకు. వస్తూనే - "కృష్ణా! ప్రమాదం వెన్నంటి వస్తోంది. తక్షణం ఎక్కడికైనా పారిపో!" అంటూ భయంతో తొందరపెట్టింది.

వీరి అంతర్యాన్ని చూచాయగా తెలిసికొన్న సిరాజుద్దీన్ భగ్గుమన్నాడట. ఆ భగ్గుమన్న అగ్ని దావానలమై కృష్ణను దహించి వేయనున్నదని గ్రహించిన నూర్జహాను- తనను గురించి ఆలోచనకంటే కృష్ణ ఏమైపోతాడో అని ఉరుకులు పరుగులతో

వచ్చి పడింది కృష్ణను రక్షించుకోవటానికి.

"పారిపోవటమా..... నేనే వెళ్ళి మీనాన్నగారిని కలుస్తాను" అన్నాడు కృష్ణ

"వద్దు. ఆయనేమిటో మీకు తెలియదు. నాకు తెలుసు. చూస్తూ చూస్తూ మిమ్మల్ని అగ్నికి శలభాన్ని కానివ్వను." వణికిపోతూ కృష్ణను పెనవేసుకొని పోయింది.

నూర్జహాను గుండె చప్పుళ్ళు కృష్ణను ఆప్రయత్నం నుండి వారించాయి.

"మరో క్షణం మీరిక్కడ వుండవద్దు-" తొందర చేసింది.

"మరి నీవు?"

"నేనేమైనా పరవాలేదు - మీరు క్షేమంగా వుండాలి", నూర్జహాను కనుల నిండా భయం... ఆవేదన.

"నా ప్రాణాల కోసం పారిపోనా? చావో, బ్రతుకో కలిసే పంచుకొందాము పద" అంటూ తెల తెల వారుతుండగా సిటీలో ఓ మారుమూలనున్న హోటలుకు తీసికొని వెళ్ళాడు నూర్జహానును కృష్ణ-

తెల్లవారాక ఫాక్టరీలోని మరో ఉద్యోగి ద్వారా వారం రోజులకు సెలవు చీటి పంపి - అతని యింటి నుండి తిరిగి వస్తూ రోడ్డు దాటుతూ వుండగా ఎక్కు పెట్టిన బాణంలా ఎటు నుండి తనపైకి దూసుకొని వచ్చిందో లారి - దాని తాకిడికి ఒక్క ఉదుటున పుట్‌పాత్ పైకి దూకి త్రుటిలో ప్రమదాన్ని తప్పించుకో గలిగాడు. ఆ దాడితో తన ప్రాణాలకై వేట ప్రారంభమయిందని తెలిసిపోయింది.

సందుగొందుల వెంటబడి వాళ్ళ కళ్ళుగప్పి నూర్జహానును చేరుకోగల్గాడు.

ఈ విషయం విన్న నూర్జహాను కృష్ణను హోటలు గది నుండి బయటకే రానివ్వలేదు - ఈ నాలుగు రోజులు.

★ ★ ★

"ఈ నాలుగు రోజలు నాలుగు యుగాల్లా తోచాయి మాకు. సిరాజుద్దీన్ సంకల్పం అభేద్యమైంది. కనికరంలేని ఆ వజ్రగోళం తాకిడికి ఎంతటి ఆత్మీయులైనా చితికి పోవాల్సిందే-" ఈ అభిప్రాయంతో నూర్జహాను తన వారి నుండి దూరమవ్వటానికి మానసికంగా సిద్ధమయ్యింది.

"ఏమి చేయాలో - ఎలా చేయాలో నాకే తోచటం లేదు!" ముగించాడుకృష్ణ.

కృష్ణ చెప్పిన దంతా వింటున్న నాకు కృష్ణ, నూర్జహానుల రూపాలు 'యింతై..... యింతింతై...... వటుడింతయై' అన్నట్లు ఎంతగానో ఎదిగి కన్పించాయి.

"క్షమించండి - అన్యథా భావించకండి. నేనేం చేస్తే బాగుంటుందో తోచక మీ దగ్గరకు వచ్చాను. మీరే అన్నారుగా - మీరు 'సర్' కాదని 'భాస్కరం బాబాయి' అని - అందుకే రాగల్గాను" అన్నాడు కృష్ణ

నేనేమీ అనలేదు.

వెంటనే - లేచి కృష్ణకు మరీ సన్నిహితంగా కూర్చొని నా చేతితో అతని వీపుపై అలా తటుతూ వుండి పోయాను.

"ఈ కెమిస్టు ఉద్యోగం వదలివేసి దూరంగా వెళ్ళి బ్రతక గలననే విశ్వాసం నీకుందా?" ప్రశ్నించాను.

నా ప్రశ్నకు జవాబుగా కృష్ణ కనులలో ఏదో మెరుపు లాంటి వెలుగు తొంగి చూచింది. నా నుండి తానాశించిన నైతికబలం దొరికినట్లు అతని మోము విప్పారింది.

"నీవు.... ఆ అమ్మాయి.... మేజర్లు - న్యాయశాస్త్రపరంగా - అదలా వుంచితే ఈ ప్రపంచం విశాలమయింది. ఆత్మ విశ్వాసం, ధైర్యం వుండాలే కాని ఎక్కడైనా బ్రతకవచ్చు. మేడల్లో... కార్లలో బ్రతికేదే బ్రతుకు కాదు. మనం ఎంతటి స్థాయిలో బ్రతికామన్నది కాదు - ఎంతటి వ్యక్తిత్వంతో బ్రతికామన్నదే తృప్తి నిచ్చేది- మీకు నా మోరల్ సపోర్టు ఎప్పుడూ వుంటుంది. వెళ్ళండి మీకు మీరుగా బ్రతకండి" అన్నాను.

నా వాక్యాలు ముగియక ముందే కృష్ణ లేచాడు.

గారేజి నుండి కారు తీసాను. నే చదివిన అపరాధ పరిశోధక నవలలు, చూసిన డిటెక్టివ్ సినిమాలు స్ఫూర్తినిచ్చినట్లున్నాయి. శరవేగంతో కారును, సందులు, గొందులు మలుపులు త్రిప్పుతూ నూర్జహాను - కృష్ణలతో తెలతెలవారే సరికి కటక్‌కు వంద కిలోమీటర్ల అవతల వున్న రైల్వే స్టేషన్ నుండి బయలుదేర పోతూవున్న హౌరా మెయిల్‌లో ఎక్కించాను - వాళ్ళను.

"మీరు మోటారు కార్ల రేసులలో పాల్గొనేవారా?" చిలిపిగా ప్రశ్నించింది నూర్జహాను, అయిదు రోజులుగా అనుభవించిన టెన్షన్ నుండి మొదటిసారిగా బయటపడుతూ.

"లేదు.... కాని ఈ జీవితపు రేసులో పాల్గొంటున్న మీరున్నారుగా ప్రక్కన.... బహుశా అదై వుంటుంది దీనికి 'స్ఫూర్తి'- మీరీ రేసు గెలవాలనే నా ఆశీస్సులు"-

నా మాటలకు బయలు దేరుతూ రైలు కూసి కూత జత అయింది.

★ ★ ★

"రాఘవ" - "జానకి" వస్తున్నట్లు టెలిగ్రాము చూచుకొని కారు తీసికొని స్టేషన్‌కు వెళ్ళాను.

"నీవైతే - పెద్ద యం.డి.వి కదా కారు తీసికొని వస్తావని టెలిగ్రాం నీకే యిచ్చాను" అన్నాడు రాఘవ కారులో కూర్చుంటూ.

"అవును కృష్ణ రాలేలేదేం స్టేషన్‌కు - మేమొస్తున్నట్లు వాడికి తెలియదా?" ప్రశ్నించింది జానకి.

"కృష్ణ నేదో ట్రైనింగుకు పంపించాను - లేడు ప్రస్తుతం-" అన్నాను.

ఒకటి రెండు రోజులు మా గత స్మృతులతో, కబుర్లతో గడిపేశాము. కృష్ణను గురించి దాస్తున్నానే అన్న నేరభావం నన్ను కుదిపి వేస్తోంది; ముఖ్యంగా జానకితో మాట్లాడుతున్నప్పుడు.

'హౌరా' ఎక్కబోతూ కృష్ణ నాతో "అమ్మా, నాన్నలు ఈ సంఘం గీచిన గిరులలో ఒదిగి కూర్చొని బ్రతికినవారు. వారినెలా సమాధాన పరుస్తారో మీరు. కృష్ణ తమ్ము వదలివేసి కతఘ్నుడై వెళ్ళిపోయాడనే భావం వారికి రానివ్వకండి. ఈ చిరుదీపాన్ని తమ హృదయాంకాలలో పెట్టుకొని, కాపాడిన వారి కరుణాఋణాన్ని తీర్చుకుంటానని చెప్పండి-" అన్న మాటలు నాకు మరీ మరీ జ్ఞాపకం వచ్చాయి.

రాఘవ వాళ్ళు వచ్చిన మూడవనాటి రాత్రివాళ్ళిద్దరికి - కృష్ణ నూర్జహానుల పరిస్థితి చెప్పి - కృష్ణ నాతో అన్నమాటలను యధాతథంగా చెప్పాను. వాళ్ళనలా పంపి వేయటంలోని నా పాత్రను వివరించాను.

క్షణ కాలం -ఏదో దుర్విధి తమను వంచించి కృష్ణను తమ నుండి దూరం చేసినట్లు మౌనంగా వుండిపోయారు రాఘవ, జానకి.

"నేను మీరివ్వని ధర్మకర్తృత్వాన్ని తీసికొని మీకు అపకారం చేసివుంటే - నన్ను క్షమించండి -" అన్నాను.

మరో రెండు రోజుల తరువాత, "మరి మేమిక వెళ్ళి పోతాము గుంటూరు" అన్నారు వాళ్ళు.

"నేనంటే కోపంగా వుంది కదూ-" అన్నాను.

"లేదురా..... ఇదిగో యిది నా వద్ద యిన్నాళ్ళూ వుంది. జీవితాంతం

వుంటుంది." అంటూ రాఘవ తన సూట్‌కేసులో నుండి తీసి చూపాడు.

అది 'రావాడ మస్టారు గారి వావిళ్ళ వారి ప్రతి - "భగవద్గీత".

"అయితే మీరు నాతోనే వుండిపోతున్నారు - మరికొంతకాలం" అన్నాను.

వాళ్ళు మారు మాట్లాడలేదు.

★ ★ ★

మూడు నెలల తరువాత - "అనుమతి లేకుండా వుద్యోగ విధుల నుండి గైరు హాజరు అయినట్లు ప్రకటించి కృష్ణను వుద్యోగం నుండి తొలగించాము.

సిరాజుద్దీన్ వచ్చాడొకనాడు. రాజ్యాన్ని కోల్పోయిన రాజులా వున్నాడు. నూర్జహాను ఒక్కతే సిరాజుద్దీన్ సంతానం. ఆమె పుట్టాకే తనకు కలిసి వచ్చిందట. ఆమె అంటే పంచ ప్రాణాలు. ఆమె భవిష్యత్తు కోసం కన్నులలో వత్తులు వేసికొని వేచివున్నాడట తను.

"విధి నన్ను వంచించింది", అని బేలగా మాట్లాడాడు.

'బేగం సిరాజుద్దీన్' నిద్రాహారాలు మానివేసి నూర్జహాను కోసం మంచంలో పలవరిస్తోందట. సిరాజుద్దీన్ ఏమీ తెలియని వాడిలా ప్రవర్తించటానికి గిల్టీగా ఫీలయ్యాడట.

"ఆ నా చిన్నారి తల్లి పుట్టాకే... నేనొక మనిషినయ్యాను. మేమేం చేశామని మమ్మల్నిలా అన్యాయం చేసింది-?" సిరాజుద్దీన్ గొంతు డగ్గుత్తిక పడ్డది. ఓ నర రూప రాక్షసుడనుకొన్న సిరాజుద్దీన్ స్థానంలో ఓ పితృ హృదయం కన్పించింది నాకు.

ఆ విషాదం నుండి ఓ కోప వీచిక పొటమరించినట్లు, తెలుగు దేశం పైన, తెలుగు వారిపట్ల కోపంతో విరుచుకుపడ్డాడు.

"తెలుగు వారు దొంగలు, నా నూర్జహానును దొంగిలించారు"- అన్నాడు.

అతని ప్రస్తుత మానసిక స్థితి తెలిసిన నాకు కోపం రాలేదు.

"నేనూ తెలుగు వాణ్ణే సిరాజుద్దన్ సాబ్" అన్నాను చిన్నగా.

"క్షమించండి.... క్షమించండి భాస్కరం సాబ్..." అంటూ నా రెండు చేతులూ పట్టుకొన్నాడు. "నా ఆవేశం.... ఈ ఆవేశమే ఎన్నో అనర్థాలకు కారణమయింది-" గొణుక్కుంటూ లేచిపోయాడు.

ఆ క్షణాన... బొగిలి కూలిపోనున్న వటవృక్షంలా కన్పించాడు సిరాజుద్దీన్.

★ ★ ★

కృష్ణ నుండి అందిన జాబు, నేనిచ్చిన ఋణంలోని మొదటి చెల్లింపుగా అతడు పంపిన 'డ్రాఫ్ట్' చూచుకొని.... సెలవు పెట్టి వెళ్ళాను. వెళుతూ రాఘవ కు, జానకికి చెప్పలేదు.

★ ★ ★

తిరిగి వస్తూనే సిరాజుద్దీన్‌కు కబురు పంపాను. కంపెనీవారి ఎ.సి. మెటడర్ వ్యానులో ఆ ముగ్గురితో బయలుదేరాను.

ఎక్కడికి, ఎందుకు... అనే వారి ప్రశ్నలకు జవాబివ్వలేదు నేను.

సిరాజుద్దీన్ మారు మాట్లాడక తన కాశ్మీర్ షాల్‌లో ఒదిగిపోయి ఆ వ్యాన్‌లో ఓ వానప్రస్థుడిలా కూర్చొండిపోయాడు.

నాలుగు వందల కిలోమీటర్ల రోడ్డు పైన.... ఆపై పదిహేను కిలోమీటర్లు మోటారు లాంచిలోను ప్రయాణించి, ఆ గంగామ తల్లి ఉత్తుంగ తరంగిణియై ఒడ్లొరసి ప్రవహించి, జలపాతినియైన మరో ప్రవాహినితో సంగమిస్తున్న ఆ ప్రాంతానికి- సాయం సమయానికి చేరాము.

వాళ్ళనందరినీ ఆ మోటారు లాంచిపై, పైన నిలువబెట్టి అక్కడికి రవ్వంత దూరంలో వున్న ఆ కొబ్బరి తోటను చూపాను. దాని నంటి పెట్టుకొని వున్న మామిడి తోపును చూపాను. ఆ ప్రక్కనున్న కపిల గోవులు - గోశాలలోని లేగలు - ఆ ప్రక్కనున్న తేనె పట్టులు - గుట్టలు గుట్టలుగా పోసివున్న కొబ్బరికాయలు- అన్నింటిని చూపాను.

నేను చూపకుండానే వాటన్నింటి మధ్యా అంతా తామై తిరుగుతోన్న నూర్జహాను, కృష్ణగోపాలురను వాళ్ళే చూచారు.

'రాఘవ, జానకి ఆ సుందర దృశ్యాన్ని ఒళ్ళంతా కళ్ళై చూస్తుంటే - సిరాజుద్దీన్ తన ఒడలే మరచి చూస్తున్నాడు.

"సిరాజుద్దీన్ సాబ్! ఈ దృశ్యం మీకెలా కన్పిస్తోంది?" ప్రశ్నించాను.

వర్షింపనున్న మేఘంలా వున్నాడతడు.

"శాంతి నిలయంలా - అనిపించటం లేదా?" అన్నాను.

"అవును. ప్రవేశించటానికి నాకర్హతలేని శాంతి నిలయం-" అన్నాడు సిరాజుద్దీన్.

"అలా కాదు - మనలందరినీ ఆహ్వానిస్తోంది - ఆ శాంతి నిలయం - రండి!" అంటూ మోటారు లాంచిపై నుండి గట్టు పైకి; అక్కడ నుండి... శాంతి నిలయంలోని కుటీరంలోనికి; రాఘవను, సిరాజుద్దీన్‌ని తీసుకొని వచ్చేపాటికి - అక్కడకు ఎప్పుడు చేరిందో - నూర్జహానుకు - కృష్ణ గోపాల్‌కు ఎర్రనీళ్ళతో దిష్టి తీస్తోంది జానకి. ●

## కథ వెనుక కథ :

*నాకు తెలిసిన ఒక ముస్లిం అమ్మాయి - బ్రాహ్మల అబ్బాయి, కొంత కాలం కబుర్లాడుకొంటూ కలిసి మెలిసి తిరిగారు. జస్ట్, కలిసి మెలిసి తిరగటం మాత్రమే అనుకొంటాను. ఆ అమ్మాయి ఓనాడు అతగానితో పెండ్లాడదామనటం; అతగాడు 'అబ్బే! అలాంటి దేం లే' దనటం; ఒకటి రెండు రోజుల అంతర్మథనంతో ఆగిపోయిందా చెలిమి.*

*ఆ అమ్మాయి తండ్రి, ఈ కథ మొదటి భాగం లోని సిరాజుద్దీన్‌ను పోలినవాడు. ఆ అబ్బాయి 'సరే' అన్నట్లైతే....? - వాళ్ళ ఉదంతం ఏమయ్యేదో - ఎలా ముగిసేదో! -*

*- అని ఊహించిన ముగింపు.*

★ *(జ్యోతి మాసపత్రిక; ఉగాది; 1989)* ★